ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## ఏపీలోని ఈ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు భారీ వర్షాలు..!




**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. కొన్ని జిల్లాల్లో వరుసగా స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తూ వస్తున్నారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. సెప్టెంబర్ 09 నాటికి వాయువ్య బంగాళఖాతం, గంగా పరివాహక వెస్ట్ బెంగాల్, ఉత్తర ఒడిశా, బంగ్లాదేశ్ తీరాల ప్రాంతాల్లో వాయుగుండంగా మారే అవకాశముంది. దీంతో సగటు సముద్ర మట్టం వద్ద ఋతుపవన ద్రోణి బికనీర్, నార్నాల్, సిద్ధి, సంబల్పూర్, మధ్య బంగాళాఖాతం మరియు దాని ప్రక్కనే ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీదుగా ఏర్పడి ఉన్న అల్పపీడన ప్రాంత కేంద్రం గుండా కొనసాగుతోంది. రాబోయే మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ %డ% యానాం విషయానికి వస్తే.. ఈరోజు, రేపు తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు మరియు బలమైన ఉపరితల గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశం ఉందని తెలిపింది. ఎల్లుండి తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది.

## దేశ ప్రజలకు కేంద్రం గుడ్‌న్యూస్..
## భారీగా తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు..



**న్యూఢిల్లీ,:** పెట్రోల్, డీజిల్ ధరలను దేశ వ్యాప్తంగా తగ్గించాలని కేంద్రం ప్లాన్ చేస్తోంది. కాగా, చమురు ధరలు ఈ ఏడాది జనవరి నుంచి కనిష్ట స్థాయికి పడిపోయాయి. దీంతోనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే, మార్కెట్‌లో ముడిచమురు ధరలు క్రమంగా తగ్గుతున్న సంగతి తెలిసిందే. గత 10 ఏళ్లలో జూన్ 2022లో గరిష్ఠంగా బ్యారెల్ ధర 115 డాలర్లుగా రికార్డైంది. ప్రస్తుతం 70 డాలర్లకు చేరింది. అయితే, ముడి చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు పెట్రోల్, డీజిల్ రేట్లను ప్రభుత్వం పెంచింది. చమురుశుద్ధి కంపెనీలకు నష్టాలు వస్తాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇలా చేస్తోంది. అయితే, ముడి చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే, హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రానున్న తరుణంలో పెట్రోల్, డీజిల్ రేట్లను తగ్గించేందుకు కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలో లీటర్‌కు 4 నుంచి 6 రూపాయలు తగ్గించనున్నట్లు చెబుతున్నారు.

## దేశ శాంతికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగకూడదు



లక్నో: యుద్ధానికి సాయుధ బలగాలు సిద్ధంగా ఉండాలంటూ ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరణ ఇచ్చారు. దేశ శాంతికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగరాదనే ఉద్దేశంతోనే తాను ఆ ప్రకటన చేసినట్టు చెప్పారు. శుక్రవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, భారతదేశ సందేశం 'వసుధైక కుటుబం' అని, భారతదేశం ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని అన్నారు. అయితే ఇవాళ్టి భౌగోళిక రాజకీయ పరిస్థితుల రీత్యా దేశంలోనూ, ప్రపంచంలోనూ శాంతిని నెలకొల్పేందుకు భారతదేశం ఎల్లప్పుడూ యుద్ధానికి సన్నద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ప్రపంచ దేశాల్లో వసుధైక కుటుంబం సందేశాన్ని ఇచ్చిన ఏకైక దేశం భారత్ ఒక్కటే. ఇండియా ఎప్పుడూ శాంతిని కోరుకుంటుంది. శాంతి సందేశాన్ని చాటుతుంది. అయితే ఇవాళ మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో దేశంలోనూ, ప్రపంచంలోనూ శాంతిని నెలకొల్పాలంటే యుద్ధానికి సన్నద్ధంగా ఉండాలని సాయుధ బలగాలకు సూచించాను. అలా ఉన్నప్పుడే ఇండియా శాంతికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగదు" అని రాజ్‌నాథ్ వివరించారు. శాంతి, స్థిరత్వానికి ఉత్తర సరిహద్దు, పొరుగుదేశాల్లో నెలకొన్న పరిస్థితులు సవాలు విసురుతున్నందున వీటిలో దృష్టిలో ఉంచుకుని సైన్యాధికారులు విస్తతమైన, లోతైన విశ్లేషణ చేయాల్సి ఉందని రాజ్‌నాథ్ సింగ్ ఇటీవల లక్నోలో జరిగిన త్రివిధ దళాల కమాండర్ల సంయుక్త సమావేశంలో దిశానిర్దేశం చేశారు. రష్యా-ఉక్రెయిన్, గాజా సంక్షోభం, బంగ్లాదేశ్ పరిస్థితులను విశ్లేషించడం ద్వారా భవిష్యత్తుల్లో ఎదురయ్యే సవాళ్లను అంచనా వేయగలుగుతుతామని, ఊహించని పరిణామాలను దీటుగా ఎదుర్కోగలుగుతామని అన్నారు.

## ప్రజా భవన్ లో ప్రజావాణి వాయిదా..!


**హైదరాబాద్, :** తెలంగాణలో రేవంత్ సర్కార్ ప్రజల సమస్యలు తెలిపేందుకు ప్రజావాణి కార్యక్రమం అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే భవన్ లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతోంది. సెప్టెంబర్ 8న 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులు రాష్ట్రానికి రానున్నారు. ఈ నెల 9, 10వ తేదీలలో రాష్ట్రంలో పర్యటించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఉన్నతాధికారులతో ఆర్థిక సంఘం సభ్యులు ప్రజాభవన్ లో సమావేశం కానున్నట్లు సమాచారం. అర్బన్, రూరల్ స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన గ్రాంట్స్, ఆరోగ్య శాఖకు పీహెచ్ సీలకు ఇచ్చే గ్రాంట్లు పెంచాలని, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా పెంచాలని ప్రతిపాదనలు ఆర్థిక సంఘానికి చేయనున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగాలు, భూముల వివాదంపై ప్రజాభవన్ లో అర్జీలు పెట్టుకుంటారు. తాజాగా ప్రజాభవన్ లో ఈ నెల 10న జరగాల్సిన ప్రజావాణి వాయిదా పడింది. కేంద్ర ఆర్థిక సంఘంతో భేటీ ఉన్నందున ప్రజావాణి ఈ నెల 11 కు వాయిదా పడింది.

## విఘ్నేశ్వరుని దయతో విఘ్నాలన్ని తొలగాలి
### వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన
### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు




**సిద్ధిపేట అర్బన్ - ప్రభాత సూర్యుడు:** సిద్ధిపేట జిల్లా ప్రజలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు వినాయక చవితి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా కుటుంబసమేతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. సకల కార్యాలకు ప్రథమ పూజ చేసేది.. పూజించేది విగ్నేశ్వరున్నే అని చెప్పారు. విగ్నేశ్వరుని అనుగ్రహముతో విఘ్నాలు తొలిగి అన్నింటా శుభం చేకూరాలని ఆకాంక్షించారు. విగ్నేశ్వరుని దయతో ఎలాంటి విఘ్నాలు రాకుండా నిర్విఘ్నంగా అన్ని కార్యాలు నెరవేరాలని ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ఆ విగ్నేశ్వరుణ్ణి ప్రార్థించారు. ప్రతి ఒక్క ఇంటిలో మట్టి గణపతి ప్రతిమ ను పూజించాలన్నారు. మట్టి గణపతి పూజించడం ఎంతో శ్రేష్టమని " మట్టి గణపతి మహా గణపతి " అని చెప్పారు. పర్యావరణాన్ని పరిరక్షణ తో దేవున్ని పూజించాలని పిలుపునిచ్చారు.

# పటిష్టంగా చైనా-ఆఫ్రికా బంధం!



మూడు రోజుల పాటు జరిగే చైనా-ఆఫ్రికా సహకార వేదిక సమావేశాలు బుధవారం నాడు బీజింగ్లో అట్ట హాసంగా ప్రారంభమయ్యాయి.వర్తమాన భూభౌతిక రాజకీయాల్లో ఈ వేదిక 8వ సమావేశాలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ఆఫ్రికాలోని 54కు గాను 53దేశాల నుంచి ప్రభుత్వాల నేతలు, ప్రతినిధులు హాజరయ్యారు. తైవాన్ను చైనాగా గుర్తించిన ఒక చిన్నదేశం నుంచి రాలేదు. నేటి ఉత్తర, దక్షిణ అమెరికా, ఐరోపా దేశాలు ఒకనాడు చీకటి ఖండగా పిలిచిన ఆఫ్రికాను తమ ఉత్పత్తులకు మార్కెట్గా, తమ పరిశ్రమలు, గనులు,భూముల్లో పనిచేసేందుకు అక్కడి జనాలను బానిసలుగా పట్టుకువచ్చేందుకు అనువైన ప్రాంతంగా మాత్రమే చూసినట్లు చరిత్ర చెబుతోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 1525 నుంచి 1866 వరకు నూతన ప్రపంచంగా వర్ణితమైన ప్రాంత దేశాలకు 125లక్షల మంది ఆఫ్రికన్లను బానిస లుగా తరలిస్తే ఆయా దేశాలకు చేరినవారు 107లక్షలు మాత్రమే, పద్దెనిమిది లక్షల మంది ప్రయాణాల్లో మరణించారు. చరిత్రలో మరికొన్ని చోట్ల బానిసల గురించి ప్రస్తావన, ఉనికి ఉన్నప్ప టికీ ఇంత పెద్దఎత్తున తోటి మానవులను పశువుల కంటే హీనంగా చూసిన దారుణం మరొకటి లేదు. వర్తమానంలో బానిసలుగా చేసుకొనే అవకాశం లేదు గనుక పశ్చిమదేశాలు ఇప్పటికీ ఆఫ్రికాను మార్కెట్గానే చూస్తున్నాయి.అందుకే అక్కడ అభివృద్ధి లేదు. ఈ శతాబ్ది ప్రారంభంలో చైనా చొరవతో సహకార వేదిక ఉనికిలోకి వచ్చిన తరువాత తమనెక్కడ ఆఫ్రికన్లు పూర్తిగా విస్మరిస్తారో అన్న భయంతో పశ్చిమదేశాలు కొంతమేరకు తమ మూటలు విప్పుతున్నాయి. అయితే చైనాతో వాణిజ్య లావాదేవీలు, పెట్టుబడుల పెరుగుదల చూసిన తరువాత వాటికి ' రాజకీయ' భయం పట్టుకుంది.చైనాను అడ్డుకొనేందుకు సామ,దాన,బేధ,దండోపాయాలను ప్రయోగిస్తున్నాయి. 2000 సంవత్స రాలో ఉనికిలోకి వచ్చిన చైనా-ఆఫ్రికా సహకార వేదిక ప్రతి మూడేండ్లకు ఒకసారి శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించి భవిష్యత్ కార్యక్ర మాలను నిర్ణయించుకుంటుంది. ఇప్పుడు బీజింగ్లో ప్రారంభమైన ఎనిమి దవ సమావేశం కూడా అదే చేయనుంది. ఈ వేదిక సాధనంగా ప్రపంచంలోని పేద దేశాలకు చెందిన 280కోట్ల మంది జీవితాలను నవీకరించవచ్చని సమావే శాలను ప్రారంభించిన చైనా అధినేత షీ జిన్పింగ్ చెప్పారు. చైనా-ఆఫ్రికా రెండూ సామ్రాజ్య వాదుల దురాక్రమణ, వలసవాదానికి వ్యతిరేకం గా పోరాడినవే అని గుర్తు చేశారు. చైనాతో పెట్టుకున్న దేశాలన్నీ రుణ ఊబిలో చిక్కుకుపోయి చివరికి దాని చేతిలో బందీలుగా మారిపోవాల్సి ఉంటుందని సామ్రాజ్యవాద దేశాలు, వాటి కనుసన్నలలో పనిచేసే మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రత్యక్ష వలసలు సాధ్యం కాదని గ్రహించిన వారు మార్కెట్లను ఆక్రమించు కొనేందుకు నయావలస విధాన సాధనాలుగా ఐరాస, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థలను ముం దుకు తెచ్చారు. అవేవీ పేద,వర్ధమానదేశాలను ఉద్ధరించేవి కాదని ఎనిమిది దశాబ్దాల అనుభవం నేర్పింది. వాటి విధా నాల పర్యవసానమే లాటిన్ అమెరికా, ఇతర అనేక దేశాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి, సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల్లో ఇరుక్కోవటం తెలిసిందే. దానికి వ్యతిరేకంగా తలెత్తిన పోరాటాలను అణచేందుకు మిలిటరీ, మితవాద నిరంకుశ శక్తులను రుద్ది ప్రజాస్వామ్యాన్ని కూడా హరించటం దాస్తే దాగేది కాదు. ఇప్పటి వరకు తాను పెట్టుబడులు పెట్టిన లేదా రుణాలిచ్చిన దేశాల్లో అలాంటి శక్తులను చైనా ప్రతిష్టించిన లేదా పనిగట్టుకొని సమర్ధించిన దాఖలాలు లేవు. చైనా పెట్టుబడులు లేదా వాణిజ్య లావాదేవీలను చూపి వాటికి లంకె పెడుతూ కొందరు కుట్ర సిద్ధాంతాలను ముందు కు తెస్తున్నారు.తాజా సమాచారం ప్రకారం ఆఫ్రికా దిగుమతి చేసుకుంటున్నవాటిలో చైనా వాటా 16శాతం కాగా దానికి చేస్తున్న ఎగుమతులు పాతికశాతం ఉన్నాయి. ఎవరు లబ్ది పొందుతున్నట్లు? నరేంద్రమోడీ సర్కార్ చైనా నుంచి రుణాలు గానీ పెట్టుబడులు గానీ స్వీకరించకుండానే భారీ ఎత్తున చైనా నుంచి దిగుమతులు ఎందుకు చేసుకుంటున్నట్లు? వంద బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యం చైనాకు ఎందుకు సమర్పిస్తున్నట్లు ? అమెరికా, ఐరోపాదేశాలన్నీ చేస్తున్నదేమిటి ? చైనా తయారీ వస్తువులు లేకపోతే వాటికి పూడగడవటం లేదు కదా! అమ్మ పెట్టదు-అడుక్కు తిననివ్వదు అన్నట్లుగా దశాబ్దాల తరబడి పెట్టుబడులు లేదా సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి పశ్చిమ దేశాలు ముందుకు రాలేదు కనుకనే ఆఫ్రికా నేడు చైనా వైపు చూస్తున్నది.రానున్న పది సంవత్సరాల్లో చైనా-ఆఫ్రికా సహకారం మరింతగా విస్తరించేందుకు బీజింగ్ సభ బాటలు వేస్తున్నది. దాన్ని అడ్డుకోవటం ఎవరితరమూ కాదు!

# 'అమరావతి' ముంపు ఓ అభూతకల్పన



ఒకవైపు బుడమేరు వరదలతో విజయవాడ నగర ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే ఇదే అదనుగా కొంతమంది అమరావతి మునిగిపోయిందని ప్రచారం చేయడం చూస్తుంటే శవాలపై చిల్లర ఏరుకొనే ప్రయత్నం చేస్తున్నట్టుగా ఉంది. ప్రజల కష్టాలతో మాకు పనేంటి... ఎవరు ఏమైతే ఏంటి... తమ నాయకునికి అమరావతి ఇష్టం లేదు కాబట్టి, అమరావతిపై బురదజల్లే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు ఉన్న ప్రాంతంలో 48 గంటల పాటు అతి భారీ వర్షం కురిసినా చుక్క నీరు నిలవలేదు. కానీ ఉద్దేశ్యపూర్వకంగా అమరావతి మునిగిపోయింది అంటూ కొన్ని మీడియా సంస్థలు, కొన్ని సోషల్ మీడియాలలో కొందరు చిలవలు పలవలుగా ప్రచారం చేస్తున్నారు. విజయవాడ నగరంలో 48 గంటలపాటు అతిభారీ వర్షం కురవడమే కాకుండా బుడమేరు కట్టలు తెగిపోవడం, కృష్ణానదికి దాదాపు 40 వేల క్యూసెక్కుల వరద నీరు రావడం వల్ల నగరం వరదనీటితో అతలాకుతలమైంది. గత రికార్డులను బట్టి ఎన్టీఆర్ జిల్లా సాధారణ వర్షపాతం 17.1 మిల్లీ మీటర్లు కాగా, ఆగస్టు 31న 329.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదే సమయంలో విజయవాడ సాధారణ వర్షపాతం 14.9 మిల్లీమీటర్లు కాగా, ఒక్క రోజులోనే 327.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎన్టీఆర్ జిల్లాతోపాటు ఖమ్మం, వరంగల్ జిల్లాలలో కురిసిన భారీ వర్షాల కారణంగా మున్నేరు, వైరా, కట్లేరు వంటి ఉపనదులు పొంగి ప్రవహించాయి. ఇదే సమయంలో విజయవాడ నగరం లోపలి నుంచి ప్రవహించే బుడమేరు మళ్లింపు కాల్వకు ఆరు ప్రాంతాల్లో గండ్లు పడటంతో మున్నెన్నడూ లేని విధంగా విజయవాడ జలదిగ్బంధమైంది. కానీ విజయవాడ నగరంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని ఆసరా చేసుకొని అమరావతిపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. 2005లో భారీ వర్షాల కారణంగా ముంబాయి నగరం 48 గంటల పాటు జలదిగ్బంధంలో ఉంది. ఆ సందర్భంగా 1094 మంది చనిపోయినట్టు మహారాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 24 గంటల వ్యవధిలో ఆ నగర పరిధిలో 944 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ఆ తర్వాత కొనసాగిన వర్షం మొత్తం వారం రోజుల వ్యవధిలో 1168 మిల్లీమీటర్లు కురిసినట్టు నమోదైయింది. ఆ సమయంలో అక్కడ ఎటువంటి నదులు, చెరువులు పొంగి పొర్లలేదు, కట్టలు తెగలేదు. కానీ భారీ వర్షాలకు ముంబాయి నగరం గజగజ వణికిపోయింది. అయినా ఎవరూ రాజధాని నగరమైన ముంబాయిని మార్చమని కోరలేదు. అటువంటి ఆలోచన ఎవరూ చేయలేదు. ఇంకా చెప్పాలంటే నిన్న మొన్నటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని, నేడు తెలంగాణ రాజధాని నగరమైన హైదరాబాద్ పట్టుమని 20 మిల్లీమీటర్ల వర్షం పడితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విజయవాడ నగర పరిధిలో ఆకస్మికంగా వరద వచ్చినప్పటికీ అదృష్టం కొద్దీ ప్రాణనష్టం పెద్దగా జరగలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కేంప్ కార్యాలయాన్ని విజయవాడ కలెక్టరేట్‌కు మార్చడంతోపాటు స్వయంగా ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి ప్రజలకు అండగా నిలిచారు. బుడమేరు- మైలవరం ప్రాంతంలోని కొండల నుంచి ప్రారంభమై అనేక వాగులు, వంకలతో కలసి విజయవాడ నగరంలో ప్రవేశిస్తుంది. మూడు దశాబ్దాల క్రితం వరకు అధిక వర్షాలు కురిసిన ప్రతిసారి పంట పొలాలను ముంచెత్తి, రైతులకు తీవ్ర నష్టం కలిగించేది. ఆ సమయంలో బుడమేరు పరివాహక ప్రాంతంలో జనావాసాలు లేవు. బుడమేరు కారణంగా రైతులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని అది విజయవాడ నగరంలో ప్రవేశించకుండా దారిమళ్లించే పథకాన్ని రూపొందించారు. దీని ప్రకారం బుడమేరు వరద దారి మళ్లే విధంగా పెద్దకాల్వ (బుడమేరు డైవర్షన్ ఛానల్) తవ్వడంతో పాటు నీరు ఆ కాల్వ ద్వారా విజయవాడకు ఎగువున ఇబ్రహీంపట్నం ప్రాంతంలో విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్‌కు సంబంధించిన కాల్వకు అనుసంధానం చేశారు. అప్పటి నుంచి విజయవాడకు బుడమేరు తాకిడి తగ్గిపోయింది. ఇదే సమయంలో నగరం విస్తరించడంతో బుడమేరు పరివాహక ప్రాంతంలోని పంట పొలాలన్నీ జనావాసాలుగా మారిపోయాయి. ఇప్పుడు విజయవాడలో ముంపునకు గురైన జనావాసాలన్నీ బుడమేరు పరివాహక ప్రాంతంలోనే ఉన్నాయి. భారీ వర్షాలు కురవడంతో పాటు బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు గండ్లు పడటం వల్లనే విజయవాడ నగరానికి ఈ పరిస్థితి దాపురించింది. ప్రస్తుత పరిస్థితి మరల పునరావృతం కాకుండా ఉండాలంటే బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు గండ్లు పడకుండా పటిష్ఠమైన రివిట్‌మెంట్ చేయడంతోపాటు ఎప్పటికప్పుడు ఛానల్ కట్టలను పర్యవేక్షించాలి. నూతన ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా ఎంపిక చేసిన అమరావతి ప్రాంతం చాలా ఎత్తైనది కావడమే కాకుండా, కృష్ణానదికి 10 కి.మీ. దూరంలో ఉంటుంది. అమరావతి కోర్ ఏరియాలో వెలగపూడి, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయపాలెం వంటి మొత్తం 29 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు ఎప్పుడూ వరద ముంపునకు గురికాలేదు. అమరావతి ముంపు అనేది అభూతకల్పన మాత్రమే. ప్రకృతి వైపరీత్యాన్ని ప్రకృతి వైపరీత్యంగానే చూడాలి. చేతనైతే కష్టాలలో, ఇబ్బందులలో ఉన్న ప్రజలకు చేయూతనివ్వాలి. అంతేకానీ ప్రజల కష్టాలను ఆసరా చేసుకొని రాజకీయం చేయాలని, ప్రజా రాజధాని అమరావతిపై లేనిపోని ప్రచారం చేస్తే ప్రజలు మరోసారి బుద్ధిచెబుతారని గుర్తుంచుకోవడం మంచిది.

# మంగోలియాలో పుతిన్ అరెస్ట్ కోసం



అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవలి రెండు రోజుల మంగోలియా పర్యటన అంతర్జాతీయ దష్టిని కూడా ఆకర్షించింది. ఒక సంవత్సరం క్రితం రష్యా అధ్యక్షుడికి అరెస్ట్ వారెంట్ జారీ చేసిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసీసీ) శాసన పరిధిని ఆమోదించిన దేశాలలో మంగోలియా ఒకటి. అప్పటి నుంచి, పుతిన్ ఐసీసీకి బాధ్యతలు కలిగి ఉన్న ఏ దేశాలను సందర్శించలేదు. కొంతమంది ఐరోపా రాజకీయ నాయకులు దౌత్యవేత్తలు అని పిలవబడే వారు ఉలాన్బాతర్ ఐసీసీ ఆదేశాన్ని పాటిస్తారని తీవ్రంగా ఆశించారు. కానీ అది జరగలేదు. మంగోలియా తన సార్వభౌమత్వాన్ని పునరుద్ఘాటించింది. అంతర్జాతీయ సంస్థల నిర్ణయాల కంటే దానికిప్రాధాన్యతనిచ్చింది. ఆశ్చర్యకరంగా, యూరప్ మంగోలియాను విమర్శించింది. ఆంక్షలతో బెదిరించింది. ఉక్రెయిన్ కూడా ఉలాన్బాతర్ చర్యలను అందరికీ దెబ్బగా ఖండిస్తూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉక్రేనియన్ అధికారులు మంగోలియాకు రెండుసార్లు పంపబడిన స్పష్టమైన సిగల్ పట్టించుకోలేదని తమ విచారాన్ని వ్యక్తం చేశారు. యాదశ్చికంగా ఉక్రెయిన్ తాజా హిస్టీరియా యొక్క ఒక రోజు తర్వాత, ఉక్రేనియన్ విదేశాంగ మంత్రి డిమిత్రి కులేబా రాజీనామా చేశాడు. మంగోలియాని బెదిరించినా బెదరలేదు. ముఖ్యంగా ఐసీసీ మంగోలియాపై జరిమానా విధించదు లేదా ఏ విధంగానూ ప్రభావితం చేయలేదని ప్రధాన న్యాయ నిపుణులందరూ అంగీకరించారు. అంతేకాదు మంగోలియాను ఐసీసీ నుంచి బహిష్కరిస్తారని భావించడం కూడా ఊహించలేని విషయం. అమెరికా కూడా ఈ అంశంపై మౌనంగా ఉంది. ఎందుకంటే మాస్కో వలె వాషింగ్టన్ కూడా ఐసీసీ తీర్పులను గుర్తించదు. దానిపై తగిన అధికార పరిధిని కలిగి లేదు. అంతేకాకుండా ఐసీసీపై ఒత్తిడి తీసుకురావడానికి అమెరికా బహిరంగంగా అనేక వ్యూహాలను ఉపయోగి స్తుంది. అంతర్జాతీయ ట్రిబ్యునల్ అని పిలవబడే ఈ అంతర్జాతీయ ట్రిబ్యునల్తో అనుబంధించబడిన కొంతమంది న్యాయమూర్తులు, ప్రాసిక్యూటర్లు ప్రత్యేకంగా నియమించబడిన జాతీయులు, బ్లాక్ చేయబడిన వ్యక్తులలో జాబితా చేయబడ్డారు. వారు అమెరికా లేదా వారిని అమెరికాకి రప్పించగల దేశాల్లోకి ప్రవేశిస్తే నేరారోప ణలు ఎదుర్కోవచ్చు. మంగోలియా ఐసీసీ ద్వారా ఒత్తిడికి లోనయ్యే ఇతర దేశాలకు ఒక నమూనాగా పనిచేస్తుంది. దాని ప్రవర్తన ద్వారా, ఉలాన్బాతర్ జాతీయ ప్రయోజనాలను, అన్నింటికంటే సార్వభౌమత్వాన్ని గౌరవిస్తుందని స్పష్టంగా చూపిస్తుంది. ఏదేమైనా, పుతిన్ పర్యటన ముఖ్యమైనది ఎందుకంటే ఇది ప్రపంచ వేదికపై ఐసీసీ క్షీణిస్తున్న పాత్రను హైలైట్ చేస్తుంది. మారుతున్న భౌగోళిక రాజకీయ డైనమిక్స్, పెరుగుతున్న ఆసియా ప్రభావం మధ్య రష్యన్-మంగోలియన్ సంబంధాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను కూడా ఇది నొక్కి చెబుతుంది. రాజకీయ, ఆర్థిక, సాంస్కతిక సంబంధాలతో సహా మాస్కో, ఉలాన్బాతర్ మధ్య సంబంధాలను సమగ్రంగా బలోపేతం చేయడం ఈ పర్యటన ప్రాథమిక లక్ష్యాలలో ఒకటి. ఇంధనం, మౌలిక సదుపాయాలు, వ్యవసాయ రంగాల్లో సహకారంతో సహా పలు అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. వాణిజ్యం, ఆర్థిక పరస్పర చర్యలను మెరుగుపరచడానికి, ఉమ్మడి ప్రాజెక్టులను అభివద్ధి చేయడానికి ఒప్పందాలు సంతకం చేయబడ్డాయి. నిస్సందేహంగా, రష్యా, చైనా మధ్య మంగోలియా యొక్క వ్యూహాత్మక స్థానం ఆసియాలో మాస్కోకు పెరుగుతున్న ముఖ్యమైన భాగస్వామిగా చేస్తుంది. మంగోలియాలో పుతిన్ సందర్శన ఐదు సంవత్సరాలలో మొదటిది - అతని చివరి పర్యటన 2019. అప్పటి నుంచి, భౌగోళిక రాజకీయ దశ్యం నాటకీయంగా మారిపోయింది. కరోనా మహమ్మారి, ఉక్రెయిన్పై రష్యా, అమెరికాల మధ్య ఉద్రిక్తతలు పెరగడం, తూర్పు, పశ్చిమాల మధ్య తీవ్ర పోరాటం, పాశ్చాత్య ఆధిపత్యం క్రమంగా క్షీణించడం వంటి విషయాలు రాజకీయాలను తీవ్రస్థాయిలో ప్రభావితం చేశాయి. మంగోలియన్ అధ్యక్షుడు రష్యా అధినేత తన పర్యటనకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ఇంధనం, రవాణా, పర్యావరణ సమస్యలు, సంస్కతి, విద్య, ఆరోగ్య సంరక్షణ, మానవతా ప్రయత్నాలలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఇది చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు.ప్రతి స్పందనగా, మంగోలియాతో సంబంధాలు ఆసియాలో రష్యా విదేశాంగ విధాన ప్రాధాన్యతలలో ఒకటి. ఇవి సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ఉన్నత స్థాయికిచేరుకున్నాయి అని పుతిన్ నొక్కిచెప్పాడు.

